క్లుప్తంగా

కేంద్ర మంత్రికి ఆహ్వానం



కేంద్రమంత్రికి ఆహ్వానం అందజేస్తున్న నిర్వాహకులు

చంచల్‌గూడ: కుర్మగూడ డివిజన్ ఉప్పరిగూడలో శ్రీరామభక్త సమాజం ఆధ్వర్యంలో ఈ నెల 30న నిర్వహించే సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొనాలని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డికి నిర్వాహకులు ఆదివారం ఆహ్వానపత్రిక అందజేశారు. నాలుగు దశాబ్దాలుగా అత్యంత వైభవంగా 16 రోజులు పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయనకు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నిరంజన్‌యాదవ్, యశ్వంత్, ప్రవీణ్ తదితరులున్నారు.

జలవనరులను కాపాడుకోవాలి

మన్సూరాబాద్: జలవనరులను రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్‌యాదవ్ అన్నారు. సీడ్స్ స్వచ్ఛంద సంస్థ, జలమండలి సంయుక్త ఆధ్వర్యంలో నాగోలు డివిజన్ పరిధి రాక్‌టౌన్‌కాలనీలో ఆదివారం నీటి పొదుపు... నీటి వృథాను అరికట్టడంపై అవగహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఒక్కొక్క నీటి చుక్కను ఒడిసి పట్టి భవిష్యత్ తరాలకు నీటి భరోసా ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ ప్రేమ్‌కుమార్, సీడ్స్ సంస్థ సీఈఓ నాగబ్రహ్మచారి పాల్గొన్నారు.

రూ.3 కోట్ల యూజీడీ పనులకు నిధులు మంజూరు



జక్కిడి మల్లారెడ్డి

మన్సూరాబాద్: పలు కాలనీలలో భూగర్భ డ్రైనేజీ పనులను సుమారు రూ.3 కోట్ల నిధులను ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మంజూరు చేయించారని మన్సూరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి తెలిపారు. మన్సూరాబాద్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. త్వరలోనే డ్రైనేజీ పనులను ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పనులను ప్రారంభించనున్నట్లు స్పష్టం చేశారు.

బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌లకు ప్రత్యామ్నాయంగా ప్రజా పార్టీ

వనస్థలిపురం: తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీగా ప్రజా పార్టీ అవతరిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ దాసరి అజయ్‌కుమార్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం వనస్థలిపురం యశోదనగర్‌లో తన నివాసంలో ప్రజా పార్టీ రాష్ట్ర ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ ఇన్‌చార్జిలను నియమించారు. నాయకులు అంజియాదవ్, సతీష్ యాదవ్, భరణి యాదవ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనకు దేవాలయాలు దోహద పడతాయి



యాగశాలను ప్రారంభిస్తున్న దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: ఆధ్యాత్మిక చింతనకు దేవాలయాలు ఎంతగానో దోహద పడతాయని కాంగ్రెస్ పార్టీ జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు.లింగోజిగూడ డివిజన్ పరిధిలోని గ్రీన్ పార్క్ కాలనీ శ్రీ పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయ అవరణలో నిర్మించిన యాగశాలను ఆదివారం రాజశేఖర్‌రెడ్డి కాలనీ వాసులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు.

చిన్నారుల సందడి



దిల్‌సుఖ్‌నగర్: విద్యార్థులను చదువులతో పాటు అన్ని రంగాలలో తీర్చిదితున్నామని గౌతమ్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్. నరసింహ అన్నారు. ఆర్‌కేపురంలోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో యూకేజీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే ఆదివారం పాఠశాల ఆవరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగావిద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అభివృద్ధి మాదే... గెలుపూ మాదే

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసింది మేమే. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం అని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం వనస్థలిపురంలో బీఆర్ఎస్ డివిజన్ కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సహకారంతో ఏ నియోజకవర్గంలో లేని విధంగా ఎల్‌బీనగర్‌లో ప్రతిష్టాత్మక ప్రాజెకులు నిర్మించామన్నారు. నాలుగేళ్ల క్రితం అమెరికా వెళ్ళినవారు తిరిగివచ్చి ఎల్‌బీనగర్ అభివృద్ధిని చూసి ఆశ్చర్యపోతారని ఆయన పేర్కొన్నారు. ఎక్కడా లేని విధంగా అనేక పార్కులను అభివృద్ధి చేసుకున్నామని, రెండు స్విమ్మింగ్‌పూల్‌లను ప్రారంభించుకోగా మరొకటి హస్తినాపురంలో సిద్ధమవుతోందని అన్నారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీఎస్ఐడీసీ చైర్మన్ అమరవాది లక్ష్మీనారాయణ, మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి



శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయానికి రూ.25 వేల నగదును అందజేస్తున్న చిలుక ఉపేందర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: దేవాలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి తెలిపారు. నల్గొండ జిల్లా మధనపురంలో నిర్మిస్తున్న శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయానికి చిలుక ఉపేందర్‌రెడ్డి రూ. 25 వేలను ఆదివారం తన నివాసంలో నిర్వాహకులకు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో పూర్ణ చందర్ రావు, పెద్దవూర సైదులు పాల్గొన్నారు.

నేడు రెయిన్‌బజార్‌లో విగ్రహ ప్రతిష్ఠాపన

చంచల్‌గూడ: కుర్మగూడ డివిజన్ రెయిన్‌బజార్ సాయిబాబా ఆలయంలో దత్తాత్రేయ, శివలింగం విగ్రహాలను నూతనంగా ఏర్పాటు చేయనున్నారు. ఆదివారం నుంచి ప్రతిష్టాపన మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. విగ్రహాలకు జలాధివాసము, క్షీరాధివాసము అనంతరం విగ్రహాలను సోమవారం ప్రతిష్ఠించనున్నట్లు ఆలయన ప్రతినిధి జగదీష్‌గౌడ్ తెలిపారు.



విగ్రహాలకు జలాభిషేకం చేస్తున్న భక్తులు

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీలో ఆదివారం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అభయాంజనేయ స్వామి దేవాలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం భక్తి శ్రద్ధల నడుమ వైభవంగా జరిగింది. శనివారం రాత్రి జల్‌పల్లి కార్గో రోడ్డులోని ముత్యాలమ్మ దేవాలయం నుంచి వందలాది మంది భక్తజన సందోహం మధ్య విగ్రహాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. ఆదివారం మండపారాధన, స్వామి వారి విగ్రహాలకు అభిషేకం, దాన్యాధివాసం, మండపారాధన, హోమం తదితర పూజా కార్యక్రమాలు కొనసాగాయి. సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపన జరగనుంది.



హోమం నిర్వహిస్తున్న పురోహితులు

బొమ్మగాని ధర్మభిక్షంకు ఘన నివాళి



ధర్మబిక్షం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేములయ్యగౌడ్ తదితరులు

మన్సూరాబాద్: మాజీ పార్లమెంట్ సభ్యుడు బొమ్మగాని ధర్మభిక్షం 12 వ వర్ధంతిని చింతలకుంటలోని అఖిల భారత గౌడ సంఘం కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు కూరెళ్ల వేములయ్యగౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మబిక్షం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు మిద్దేల మల్లేశం గౌడ్, ముద్దగాని నగేష్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు వివాహ అవగాహన కేంద్రం ఏర్పాటు అభినందనీయం

మలక్‌పేట: న్యాయ సలహాలు, అవగాహనలతో వివాహబంధం పటిష్టతకు, కలహ నివారణకు ముందస్తు వివాహ అవగాహన కేంద్రం ఏర్పాటు చేయడం గొప్ప విషయమని రాష్ట్ర బీసీ కమీషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. పట్టింపులు, అనవసర అనుమానాలు, పరస్పర అవగాహనా లోపం, అభిప్రాయ బేధాలు, స్వల్ప కాలిక, క్షణికావేశాల మూలంగా ఛిద్రమవుతున్న కుటుంబాలకు ఇలాంటి కేంద్రాలు వెన్నుదన్నుగా ఉంటాయని పేర్కొన్నారు. గడ్డిఅన్నారం కళ్యాణ్‌నగర్‌లో ప్రముఖ హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ప్రీ మారిటల్ కౌన్సిలింగ్ సెంటర్' ఆదివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, సామాజిక వేత్తలు, ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ నాయకులు పాల్గొన్నారు.



కృష్ణమోహన్‌రావును సన్మానిస్తున్న అడ్వకేట్ రాపోలు భాస్కర్

నీటిని వృథా చేయరాదు

నాగోలు: నీటిని వృథా చేయకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జలమండలి డైరెక్టర్ శ్రీధర్‌బాబు అన్నారు. సీడ్ సంస్థ ఆధ్వర్యంలో జలమండలి సహకారంతో నాగోలు డివిజన్ చాణక్యపురి కాలనీలో ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన జలమండలి డైరెక్టర్ శ్రీధర్ బాబు మాట్లాడుతూ నీటి పొదుపులో మన కుటుంబంతో మొదలై ఇతర కుటుంబాలకు ఆదర్శంగా నిలిచి నీటి పొదుపు గురించి తెలియజేయాలని కోరారు. మొదటగా మన ఇండ్లలో నీటిని పొదుపు చేసేటటువంటి పద్ధతులను ఇతర కుటుంబాలకు తెలియజేసినట్లయితే వారు కూడా మారతారని పొదుపు చేస్తారని తెలియజేశారు. జలమండలి రేషన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ ప్రత్యేక అధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ భవనానికి స్థలం కేటాయించండి

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని మాల కమ్యూనిటీకి సంబంధించి ఆత్మగౌరవ భవనం కోసం స్థలాన్ని కేటాయించాలని ఆదివారం కులపెద్దలు మీర్‌పేటలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సబితారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్పొరేషన్‌లో మాల కులస్తుల జనాభా సుమారు 16వేలు ఉందని, విద్య, ఆర్థిక రంగాల్లో వెనుకబడి ఉన్నారని, ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహకారం అందేలా చొరవ తీసుకోవాలని కోరారు. ఆత్మగౌరవ భవనం కోసం 500 గజాల స్థలాన్ని కేటాయించడంతో పాటు భవనం నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని వారు మంత్రికి విన్నవించారు. మంత్రి స్పందిస్తూ త్వరలోనే స్థలం కేటాయించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గజ్జెల రాంచందర్, చెవ్వ శ్రావణ్, సూల ప్రభాకర్, సుదర్శన్, యాదగిరి, ఆవుల జనార్దన్, రాజలింగం, జి.నర్సింగ్‌రావు, గొట్టె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

పహాడీషరీఫ్: క్రికెట్ పోటీలతో యువతలో ఐక్యతా భావం పెంపొందుతుందని మామిడిపల్లి బాల మణికంఠ అయ్యప్ప దేవస్థానం ధర్మకర్త మద్ది జగదీశ్వర్ రెడ్డి గురుస్వామి అన్నారు. బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మామిడిపల్లి ప్రీమియర్ లీగ్(ఎంపీఎల్)-7 క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. 45 రోజుల పాటు సాగే ఈ పోటీల్లో మొత్తం ఏడు జట్లు పాల్గొననున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బండారి గోపాల్ యాదవ్, గ్రామ నాయకులు ఎడ్ల వాసుదేవరెడ్డి, లాల్ సతీష్ గౌడ్, రఘువీర్ రెడ్డి, జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కారానికి కంట్రోల్ రూం

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి సర్కిల్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు ఎస్ఈ పి.కరుణాకర్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, ఇతర సమస్యలు ఏమైనా ఉంటే నేరుగా 79016 79095 ఫోన్ నంబర్‌కు సమాచారం ఇస్తే.. సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. వినియోగదారులు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.


నూతన కమిటీ ప్రమాణస్వీకారం

మన్సూరాబాద్: హైదరాబాద్ లారీ సప్లయిర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణస్వీకారం మన్సూరాబాద్ డివిజన్ ఆటోనగర్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో మాజీ అధ్యక్షుడు చిరుమామిళ్ల మధు అధ్యక్షతన ఆదివారం ఘనంగా నిర్వహించారు. అధ్యక్షులుగా పోకూరి శ్రీనివాస బాబు, ప్రధాన కార్యదర్శిగా జువ్వాజీ శ్రీనివాస రావు, కోశాధికారిగా కిష్టాపురం శంకర్‌లు ప్రమాణ స్వీకారం చేశారు.



హైదరాబాద్ లారీ సప్లయిర్స్ అసోసియేషన్ నూతన కమిటీ నాయకులు

గుంటి జంగయ్యనగర్‌లో రోడ్లపై మురుగు ప్రవాహం



వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ పరిధిలోని గుంటి జంగయ్యనగర్‌లో డ్రైనేజిలు జామ్ అయి మ్యాన్‌హోల్‌ల నుంచి మురుగు నీరు పొంగిపొర్లుతూ రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో పరిసరాలు కంపుకొడుతు రోడ్డుపై వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని రోజులుగా ఈ సమస్య ఉన్నా సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఒడిదొడుకులు ఎదుర్కొని అనుకున్న లక్ష్యాలు సాధించాలి



వీడ్కోలుకు హాజరైన విద్యార్థులు, ఉపాధ్యాయులు

మలక్‌పేట: జీవితంలో ఎదురయ్యే ఒడిదొడుకులు తట్టుకొని అనుకున్న లక్ష్యాలు సాధించాలని దిల్ సుఖ్‌నగర్ రవీంద్రభారతి స్కూల్ జోనల్ డీన్ జ్యోతి విద్యార్థులకు సూచించారు. ఆదివారం స్థానిక పాఠశాలలో పదవ, తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యార్థులు సరస్వతి దేవికి పూజలు చేసి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శిరీష, అకాడమిక్ ఇన్‌చార్జి రాఘవన్, డీఐ దయాకర్, ఉపాధ్యాయులు, ఉన్నారు.

సమష్టిగా పనిచేసి కాలనీలను అభివృద్ధి చేసుకుందాం

మన్సూరాబాద్: సమష్టిగా ప్రణాళికబద్ధంగా పని చేసి కాలనీలను అభివృద్ధి చేసుకుందామని జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి పిలుపునిచ్చారు. డివిజన్ హయత్‌నగర్ పరిధి వినాయకనగర్‌కాలనీలో నూతనంగా వేసిన సీసీ రోడ్లను ఆదివారం పరిశీలించి కాలనీ సంక్షేమ సంఘం రూపొందించిన కాలనీ ఐడీ కార్డులను పంపిణీ చేశారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కల్లెం శంకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జెట్ట మహేష్ పాల్గొన్నారు.



కాలనీ ఐడీ కార్డులను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

వాసవీ క్లబ్‌లు సేవా రంగంలో ముందున్నాయి



నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న వెంకటరమణమూర్తి

వనస్థలిపురం: వాసవి క్లబ్‌లు సేవా రంగంలో ముందున్నాయని క్లబ్ పూర్వ ఇంటర్నేషనల్ అధ్యక్షులు నూలి వెంకటరమణ మూర్తి అన్నారు. ఆదివారం వనస్థలిపురంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి కాన్ఫరెన్స్ హాలులో జరిగిన వాసవి క్లబ్‌ల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ వనస్థలి పురం, వనితా వనస్థలిపురం, వనితా ప్రశాంత్‌నగర్, వనితా వీకేఎస్‌పీ ఛత్రపతి, వనితా బాలాజీనగర్, వాసవి విద్యా విభాగ్ ఇ-క్లబ్, వాసవి క్లబ్ ఆర్‌కే.పురం క్లబ్‌ల నూతన కార్యవర్గంచే ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు.

వరద ముంపు సమస్యకు చెక్

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని పలు లోతట్టు కాలనీలు ప్రతి వర్షాకాలంలో తరచూ పీకల లోతు వరద ముంపునకు గురవుతున్నాయని త్వరలో ఏర్పాటు చేయనున్న బాక్స్‌టైప్ వరదనీటి కాలువతో సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్థానిక కార్పొరేటర్ వంగా మధుసూధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం కర్మన్‌ఘాట్‌లోని తన కార్యాలయంలో లోతట్టు కాలనీ వాసులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి ఆయన జీహెచ్ఎంసీ, ఎస్ఎన్‌డీపీ అధికారులతో కలసి హాజరయ్యారు. వరద నీటి ముంపు సమస్య పరిష్కారానికి పైపులతో ట్రంక్ లైన్ ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు మధుసూధన్‌రెడ్డిని కోరారు. నాలా ఏర్పాటుకు ఎస్ఎన్‌డీపీ ద్వారా రూ. 28 కోట్లు మంజూరు అయ్యాయని పరో పది రోజుల్లో పనులు ప్రారంభించి జులై చివరి నాటికి నాలా పనులుపూర్తిచేస్తామన్నారు. జీహెచ్ఎంసీ డీఈ వెంకటరెడ్డి, డివిజన్ బీజేపీ అధ్యక్షులు పోరెడ్డి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి

దత్తాత్రేయ కాలనీ సమస్యలను పరిష్కరిస్తా

హయత్‌నగర్: డివిజన్‌లోని దత్తాత్రేయ కాలనీలో నెలకొన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తానని స్థానిక కార్పొరేటర్ కళ్ళెంనవజీవన్‌రెడ్డి అన్నారు. కాలనీలో జరుగుతున్న అంతర్గత డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... డ్రైనేజీ పనులు పూర్తయితే కాలనీలోని ప్రధాన సమస్య తీరుతుందని, వెంటనే సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేపడతామని, వీధి లైట్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పనులలో నాణ్యతను పాటించాలని, నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని జలమండలి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జలమండలి సూపర్‌వైజర్ బాలూనాయక్, నాయకులు ఉగాది ఎల్లప్ప, కాలనీ నాయకులు వెంకట్‌రెడ్డి, రమేష్, శోభన్ తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

రంజాన్ సందడి షురూ

పహాడీషరీఫ్: పవిత్రమైన రంజాన్ మాసాన్ని జల్‌పల్లి మున్సిపాలిటీలోని ముస్లింలు నియమ నిష్టలతో జరుపుకొంటున్నారు. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు కఠోర ఉపవాస దీక్షలో ఉంటున్న ముస్లింలు రాత్రంతా మెలకువతో ఉంటున్నారు. ఎర్రకుంట, షాయిన్‌నగర్, పహాడీషరీఫ్, కొత్తపేట రహదారులు సందడిగా మారుతున్నాయి. చిన్న, పెద్ద, పేద, ధనిక అనే తేడా లేకుండా అంతా రంజాన్ పండుగలో నిమగ్నమయ్యారు. ప్రతిరోజు ఫజర్, జోహర్, అసర్, మగ్రీబ్, ఇషా ఐదు సార్లు నమాజ్ చేసి అల్లాహ్‌ను స్మరిస్తున్నారు.

మొదలైన ఇఫ్తార్ విందులు

రంజాన్ మాసం ప్రారంభం కావడంతో తొలి రోజు నుంచే ఇఫ్తార్ విందులు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. ఈ మాసంలో కాస్త ఉన్నత స్థాయిలో ఉన్న ప్రతి ఒక్కరు ఈ ఇఫ్తార్ విందులను ఏర్పాటు చేసి పరిచయస్తులను ఆహ్వానిస్తుంటారు. ఉపవాస దీక్ష విరమించిన భక్తులు.. ఇఫ్తార్ విందుల్లో రకరకాల ఫలాలను ఆరగించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఇతర పండ్లతో పాటు ఖర్జూరం వంటి పండ్లను కూడా ఏర్పాటు చేస్తారు. ఇఫ్తార్ విందుల్లో హిందూ, ముస్లింలు పాల్గొని మతసామరస్యాన్ని చాటి చెబుతున్నారు.

హలీం దుకాణాల వద్ద సందడి

రంజాన్ మాసం అనగానే ప్రధానంగా గుర్తుకొచ్చేది హలీం. రోజంతా ఉపవాస దీక్షలో ఉండే వారు సాయంత్రం దీక్ష విరమించిన అనంతరం పోషక విలువలున్న హలీంను ఆరగిస్తారు. ప్రతి రోజు సాయంత్రం 6 గంటలయిందంటే స్థానికంగా ఉన్న హలీం సెంటర్లు రద్దీగా మారుతున్నాయి. పహాడీషరీఫ్ పరిసరాలలో ఏర్పాటు చేసిన హలీం కేంద్రాలే కాకుండా పాత నగరంలో ఉన్న షా గౌస్, పిస్తా హౌజ్, షాదాబ్ వంటి హోటళ్ల నుంచి హలీం పార్సల్‌ను తెప్పించుకొని ఆరగిస్తున్నారు.



నియమ నిష్టలతో ఉపవాసం

ఇస్లాం నాలుగో మూల స్తంభం ఉపవాసం. నమాజ్ లాగే ఉపవాసం కూడా అన్ని యుగాలలో ప్రవక్తలందరు విధిగా చేశారు. గతించిపోయిన సమాజ్‌ల్లో ఉపవాసాలు పాటించేవారు. ఉపవాసాల సంఖ్య వాటిని పాటించే రుతువులు, కాలాల్లో తేడా ఉండేది. ప్రతి మతంలో ఉపవాసాన్ని పాటించడాన్ని మనం చూస్తున్నాం. ముస్లిం సమాజం త్రికరణ శుద్ధితో ఆచరించే ఆరాధన వ్రతం ఉపవాసం. దీని అరబీ భాషలో సామ్ గాను, వ్యావహారిక ఉర్దూ భాషలో రోజా..గా పిలుస్తారు. ఇస్లామియా క్యాలెండర్ ప్రకారం 9వ నెల అయిన రంజాన్ మాసంలో ఈ ఆరాధన వ్రతాన్ని పాటిస్తారు. ఇస్లాం ధర్మశాస్త్ర పరిభాషలో సామ్ అంటే ఉషోదయం నుంచి సూర్యాస్తమయం వరకు తినడం, తాగడం, మనోవాంఛలకు దూరంగా ఉండడం.

పెద్ద ఎత్తున జకాత్

రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం తమకున్న ఆస్తిలో కొంత శాతాన్ని పేద ప్రజలకు వెచ్చించాలి. ఇందులో భాగంగానే జల్‌పల్లి మున్సిపాలిటీలోని ముస్లింలు పెద్ద ఎత్తున దాన ధర్మాలు చేస్తున్నారు. పేద ప్రజలకు చీరలు, గృహావసర వస్తువులు దానం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఈ దాన ధర్మాలు పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి.